# తేలుకుట్టింది

అవధానుల సుధాకర రావు


పంచాయతీరాజ్ కమీషనర్ కార్యాలయం.

బదిలీ మీ దొచ్చిన జగన్మోహన్ ఆ రోజే తన జాయినింగ్ రిపోర్ట్ని సబ్మిట్ చేశాడు.

ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్లో వర్క్ డిస్ట్రిబ్యూషన్ చార్ట్ గోడకి వేలాడుతూ కనిపించింది. ఆసక్తిగా దాన్ని పరికించాడు జగన్.

'ఇన్స్పెక్షన్ అండ్ ఆడిట్ పార్టీ'లో ఒక సూపర్నెంటు, ఓ అకౌంటెంట్, మరో యు.డి.సి., ఒక ప్యూను. మొత్తం నలుగురు సిబ్బంది. వీళ్ళు సంవత్సర మంతా రాష్ట్రం మొత్తం పర్యటిస్తూ జడ్.పి.లు, గ్రామ పంచాయతీలని తనిఖీ చేయాలి.

ఈ కమిటీ ప్రారంభం నుంచీ నేటి దాకా ఆ నలుగురు వ్యక్తులతోనే కొనసాగుతూ వస్తోం దన్న సంగతి జగన్కి తెలిసిపోయింది. అంతే! "అన్యాయం, అక్రమం" అంటూ ఆవేశంతో బుసలు కొట్టాడు. మరో ఆలోచన లేకుండా ధైర్యంగా ఓ దరఖాస్తు పడేశాడు. ఫలితంగా ఇన్స్పెక్షన్ పార్టీ లోని సీనియర్ యూ.డీ.సీ. గారిని పక్కకు తప్పించి, జగన్కు పట్టం కట్టారు.



ట్రాజెడీపాలైన మాజీ గారు ఆ రాత్రి బార్‌లో బోరు మని ఏడుస్తుంటే - "ఎందుకయ్యా అలా ఏడుస్తావు? వాడు కేవలం ఇల్లు మాత్రమే అలుక్కున్నాడు, ముగ్గు లేసుకున్నాడు. పండుగ చేసుకోలేదుగా?" అని సహచరు లిద్దరూ ఊరడించి - "చూస్తూ ఉండు. మే వో పథకం వేస్తున్నాం. ఆ దెబ్బకి జగన్‌గాడి పని జణగణమనే ..." అని చెప్పేసరికి అయ్యగారు బెలూన్‌లా ఉబ్బిపోయాడు.

** ** **

"ఏంవయ్యా జగన్మోహనూ! వచ్చీ రాగానే తిరుగుబాటు జెండా ఎగరేశావు. మొత్తానికి నిన్ను రెబల్ హీరో అనో, లేక జగదేక వీరుడు అనే బిరుదుతోనో సత్కరించా లయ్యా!" తుమ్మలపాలెం గ్రామం బయలుదేరుతూ దార్లో అన్నాడు సూపర్నెంటు.

ఆ పొగడ్తకి జగన్ కొంచెం సిగ్గుపడ్డా, లోలోపల తను సాధించిన ఘనకార్యాన్ని తలుచుకుని గర్వపడుతూనే ఉన్నాడు. ఒక్కసారిగా తన లెవెల్ పెరిగిపోయినట్లు ఫీలైపోతున్నాడు. ఎవరూ చేయలేని మహత్తర . కార్యం సాధించిన ధీరోదాత్తుడిలా అనుకుంటున్నాడు తనని తాను. 'ఇంతటితో ఆగిపోకూడదు. ఏదో చేసెయ్యాలి. ఆకాశాన్ని కిందకు దించాలి, బ్రహ్మాండాన్ని బద్దలు చెయ్యాలి' అని ఓ తెగ ఉబలాటపడిపోతున్నాడు.

సూర్యభగవానుడి కంటే ముందే నిద్ర లేచి కూర్చున్నాడు. 'బిజీ ... యమ బిజీ!' అనుకూంటూ టేబుల్ సొరుగు లాగాడు బ్రష్ కోసం.

'బుస్సు' మంటూ పైకి లేచి - "గుడ్ మార్నింగ్" చెప్పిం దో ప్రాణి.

"వామ్మో పాము!" గావు కేక పెట్టి గంతు లేశాడు.

మామూలు స్థితికి రావడానికి ఓ పది నిముషాలు పట్టింది. ఆ పాము కిటికీలోంచి వెళ్ళిపోయాక గాని వణుకు తగ్గలేదు.

అనంతరం స్నానం చే సొచ్చి బట్టల కోసం గదిలో బ్రీఫ్ తెరవడంతోనే - "హలో!" అంటూ ప్రేమగా నోరంత తెరిచి మరీ పలుకరించింది మరో సర్పం.

జగన్ గుండె జావకారిపోయింది. చెమట అద్దుకుందా మని హేంగర్‌కి వేలాడుతున్న పేంటు జేబులోకి చేయి పోనిస్తే మళ్ళీ అక్కడో 'జూనియర్' చేతికి మెత్తగా తగిలింది కర్చీఫ్‌కి బదులుగా మిస్చీఫ్ చేస్తూ.

అంతే! హీరో కాస్తా 'జీరో' అయ్యాడు. ఆడిట్ పార్టీకి హెడ్డయిన సూపర్నెంటుని లేపి, సంగతి చెప్పి - "ఇ దేం ఊరండీ బాబూ?" అ నడిగాడు.

"మరే వనుకున్నావోయ్ ఉత్తరకుమారా! ఖరీదైన హొటల్ గదిలో బస చేసి, పైసా ఖర్చు లేకుండా అన్ని సౌకర్యాలూ అనుభవించి, బాగా మెక్కి, సుఖపడదా మనుకున్నా వేంటి?" అక్కసంత వెళ్ళగక్కా డాయన.


"అది సరేనండీ! ఈ పాము లేవి టిలా పనిగట్టుకొని పదే పదే నాకు దర్శనమిస్తున్నాయి?" అని ప్రశ్నించాడు.

"మన నలుగురిలో ని ఒక్కడివే కదా కొత్త మొహం. కాస్త అలవా టయ్యేదాకా అవి ని న్నొదిలి పెట్టవు మరి. ..."

"బాబోయ్! ముప్పై ఏళ్ళయినా లేవు. బ్రహ్మచారి వెధవని ఇలా ప్రాణాలతో చెలగాట మాడుకుంటూ ఈ ఆడిట్ ఉద్యోగం నే చెయ్యలేను" అంటూ చేతు లెత్తేశాడు.

సుపర్నెంటు చెవులకి ఆ మాట మధురంగా వినిపించింది. "అప్పుడే ఏమయిం దయ్యా!" అంటూ అందుకున్నాడు - "మన మింకా వంకాయలపాడు విజిట్ చెయ్యాలా? ఆ ఊరు మండ్రగబ్బలకి ప్రసిద్ధి. కరిస్తే ఔట్! తర్వాత బేతంచెర్ల పంచాయతీ ఉందా? అక్కడ ఇళ్ళలో చీమలు కనిపించవు. తేళ్ళు, జెర్రులే! వాటి విషం యమ పవర్‌ఫులయ్యా! అయినా నేను చెప్పడం ఎందుకు? ను వ్వెలాగూ తెలుసుకుంటావుగా!"

చలి జ్వరం వచ్చిన వాడిలా అయిపోయాడు జగన్. 'ఎరక్కపోయి వచ్చాను' అని పాడుకుందా మనుకున్నాడు. ఆ రాత్రికి కడుపులో గడబిడ కూడా మొదలైంది.



- సి.ప్రభాకర్

అ దో విచిత్రమైన అవస్థ. పక్క మీద పడుకోలేడు. బాత్రూంకు వెళ్ళి కూర్చుంటే అంతా నజావుగానే ఉంటుంది. అలా ప్రదక్షిణాలు చేస్తూ రాత్రంతా నిద్రకి దూర మయ్యాడు.

తెల్లారేసరికి అవతారమే మారింది.

"బాబూ! అయితే ఈ ఊరి నీళ్ళు మీకు పడలే దన్నమాట. ఈ లెక్కన చూస్తే వంకాయలపాడు నీళ్ళకి బంక విరోచనాలు, ఆ తర్వాత బేతంచెర్ల నీటికి కామెర్లూ తప్ప దనిపిస్తోంది." అటెండర్ చెప్పిన జోస్యంలో హాస్య మెక్కడా వినిపించలేదు.

"నిజమా సార్!" నిర్ధారణ కోసం పెద్దా ళ్ళిద్దర్నీ అడిగాడు.

"కట్టు కథలు చెప్పడానికి ను వ్వేం గిట్టనివాడివి కాదుగా తమ్ముడూ!" సానుభూతిగా అన్నాడు అకౌంటెంటు.

"మరి ఈ ఇబ్బందులు మీ కెదురు కావా?" అడిగాడు.

సూపర్నెంటు చిద్విలాసంగా - "మొండివాళ్ళం. అన్నింటికి తెగించిన వాళ్ళం. పులి నోట్లో తల పెట్టడం సర్కస్ వాడికి రిస్కు అనిపించదు నాయనా!" అన్నాడు.

అంతే! అబ్బాయిగారు తోక ముడిచారు. హెల్త్ గ్రౌండ్స్ మీద లీవు తీసుకుని హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళిపోయి ఆలస్యం చేయకుండా లిఖితపూర్వకంగా రాసిచ్చి, ఆడిట్ పార్టీ నుంచి నిష్క్రమించాడు. మళ్ళీ పాత యు.డీ.సీ. గారికే పట్టం కట్టారు.

** ** **

ఆ సందర్భాన్ని పురస్కరించుకొని పూర్వపు ఔన్నిత్యాన్ని తిరిగి పొందిన యూ.డీ.సీ. గారి ఖర్చు మీద భారీ ఎత్తున బార్‌లో పార్టీ చేసుకున్నారు ఆ నలుగురూ కలిసి.

"ఈ సంఘటన జరగడం కూడా మంచికే! ఇప్పట్లో మళ్ళీ ఎవడూ మనని కదల్చలేడు" అన్నాడు సూపర్నెంటు సిగరెట్ పొగని రింగులుగా వదులుతూ.

"ఇంతకీ ఈ ఘనకార్యాన్ని మీ రెలా సాధించారో చెప్పండి గురూగారూ!" అని యూ.డీ.సీ. అడిగాడు.

"అవసరానికి తగ్గట్టు ఏ వేవో ఎత్తుగడలు వేస్తాం. మన వాడివి - అడిగావు కాబట్టి చెప్తాను. పిచ్చి ముండలు! తుమ్మలపాలెంలో నీటి పాములు భలే రక్తి కట్టించాయి. భయంతో వాడు చిందులు తొక్కుతుంటే న వ్వాపుకోలేకపోయా మనుకో. రెండో చిట్కా పాలల్లో ఓ చిన్న మాత్ర పడేశాం. అంతే! దెబ్బకి డీలా పడ్డాడు బాలుడు!" అంటూ వివరించాడు సూపర్నెంటు.

దుష్ట చతుష్టయం సంతృప్తిగా తిన్నారు. తా గారు. బిల్లు చెల్లించాక చేతులు కలుపుకుంటూ చెప్పుకున్నారు - "ఇక మనకి తిరుగు లేదు, ఎదురు లేదు. జైత్ర యాత్రల్ని దిగ్విజయంగా. కొనసాగిస్తూ వర్ధిల్లుదాం. ఇంకా అభివృద్ధిలో కొద్దాం."

అప్పుడు స్నేహపూర్వకంగా కలిసిన ఆ చేతులే త్వరలో శత్రుత్వంతో తలపడతా యన్నది విధి లిఖితం.

తమ వైభవానికి రోజులు దగ్గర పడ్డాయనీ, ఐకమత్యానికీ ఆయువు మూడిందనీ వాళ్ళకి తెలియదు.

ఎవరో కాదు - తమకి తా మే గోతులు తవ్వుకునే సమయం సమీపించిం దనీ, చేటు కాలం దాపురించి చెట్టు కొకరు, పుట్ట కొకరుగా విడిపోనున్నా మనీ వారిలో ఏ ఒక్కరూ ఊహించలేదు.

** ** **

ఆడిట్ పార్టీలో ఉన్న ఆ నలుగుర్లో స్థూలకాయం గల వ్యక్తి ఒకే ఒక్క డున్నాడు. అతనే యూ.డీ.సీ. 'భజగోవిందం.

ఉత్త భోజన ప్రియుడే కాదు. మాంసాహార మంటే పడి చస్తాడు. ఊరికే దొరికితే ఊరపంది మాంసాన్ని కూడా మనసారా ఆరగిస్తాడు. అలాంటి శాల్తీకి పోచంపల్లి కాంప్ అంటే పంట పండినట్లే!

కారణం - ఆ ఊళ్ళో అతి పెద్ద కోళ్ళ ఫారం ఉండటమే. ఎక్కడా దొరకనంత రుచికరమైన చికెను, శ్రేష్ఠమైన గుడ్లు. ఆ ఊళ్ళో ఉన్నన్ని రోజులూ విజృంభించేస్తాడు భజగోవిందం. వెళ్ళే ముందు చూసుకుంటే ఓ అయిదు కిలో లన్నా బరువు పెరిగి ఉంటాడు.

మిగతా కేంప్సులో సాధారణంగా సూపర్నెంటే అందరి తరఫునా భోజనం, వగైరా ఏర్పాట్లు చూస్తుంటాడు. కానీ, పోచంపల్లిలో మకాం చేసినప్పుడు మాత్రం తన అభిరుచుల ప్రకారం భజగోవిందమే చొరవ తీసుకుని సంపూర్ణ హారాన్ని సమకూర్చుకుంటాడు.

ఆ రోజు బి.డి.వో. గారితో చర్చలు ముగించి బయటి కొచ్చేసరికి బాగా ఆలస్యమయింది.

ఆఫీస్ బోయ్ తమకి మీల్స్ కేరేజీలు తేవడానికి వెళ్ళడం కిటికీలోంచి చూశాడు భజగోవిందం.

"అతన్ని ఎవరు పురమాయించారు?" అసహనంగా ప్రశ్నించాడు.

"సూపర్నెంటుగారు సార్!" భయంగా చెప్పాడు మేనేజర్.



కె. కుమార్ హైదరాబాదు.

"ఏ వేం తెమ్మన్నారు?"

"ఇవ్వాళ శనివారం కదా! సింపుల్‌గా నాలుగు మీల్స్ చా లని చెప్పారు."

ఆ మాటలు చావు కబురులా, సంతాప సంగీతంలా వినిపించాయి గోవిందానికి.


"చాదస్తపు మాధవశర్మా! చంపేశావు కదోయ్!" అనుకుంటూ, తమ ప్యూను రహీంని పిలిచి "మ నందరికీ తలా రెండు బాయిల్డ్ ఎగ్స్ స్పెషల్‌వి కావాలని చెప్పిరా!" అంటూ అతన్ని బాయ్ వెనుక పరుగెత్తించాడు.

ఆ రోజు రాత్రి కెలాగూ మందు ప్లస్ చికెన్‌తో ఘనమైన విందు ఉండనే ఉంది. అప్పుడు గట్టిగా ఓ పట్టు పట్టాలి అనుకున్నాడు. లంచ్ టైం అయినా, రోజూలా భజగోవిందం భోజనానికి హడావుడి చేయకుండా రిజిస్టర్లు, వోచర్లతో కుస్తీ పట్టసాగాడు.

"భోజనానికి లేవా?" అకౌంటెంట్‌ని వెంటబెట్టు కొచ్చిన సూపర్నెంటు అడిగాడు.

"మీ ఇద్దరూ కానివ్వండి సార్! పొద్దున తిన్న ఉల్లిపాయ పెసరట్టు, ఉప్మా ఇంకా అరగలేదు. కడుపు బరువుగా ఉంది. ఇవ్వాల్టికి మానేస్తే మే లేమో!"

"అలా ఎందుకు? కాస్త పెరుగుతో ఓ గం టాగి ఎంగిలి పడు" అని చెప్పి, వా ళ్ళిద్దరూ భోజనానికి వెళ్ళబోతూ "ఏవయ్యా రహీం! లాగించేశావా?"



Trikaya Grey HCC 10.90 TEL

అని వ్యూన్ని పలకరించారు.

"మీరు తినకుండానా బాబూ!" సెల గోక్కుంటూ చెప్పాడు. అతను కర్నూల ప్రాంతంవాడు. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడతాడు కాబట్టి మిగతా ముగ్గురికీ హిందీ రాకపోయినా నడిచిపోతోంది.

ఆ ఇన్‌స్పెక్షన్ పార్టీలోని మిగతా ముగ్గురిదీ పిట్ట తిండే. ఎక్కువ తింటే అరిగించుకోలేని అర్భకులు కూడా. వా ళ్ళందరి వంతూ కూడా భజగోవిందమే ఆరగిస్తాడు కాబట్టి ముద్దుగా 'బకాసురుడు' అని పిల్చుకుంటారు వాళ్ళు.

లంచ్ రూంలోకి వెళ్ళిన అధికారు లిద్దరూ స్వల్ప వ్యవధిలోనే పాన్‌లు నవులుతూ బయటికొచ్చారు.

రహీం వాళ్ళ కారేజీలు, ప్లేట్లు కడిగి, బల్లలు తుడిచేసరికి ఇంకో అరగంట. అప్పటికీ యూ.డీ.సీ. గారి జాడ లేకపోవడంతో తను భోజనానికి కూర్చున్నాడు.

భజగోవిందానికి కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. ఇం దా కెప్పుడో భోజనానికి లేద్దా మనుకున్నాడు కాని తన మనసులో ఓ ప్లాన్



ఫొటో-సత్య శిరీష

ఉండటంతో అందరికంటే ఆఖరున తినాల్సి వచ్చింది. సూపర్నెంటుతో మరోసారి చెప్పించుకుని, అప్పుడు సీట్లోంచి లేచాడు.

లోలోపల్నుంచి సరికొత్త ఉత్సాహం, హుషారు తన్నుకొస్తుంటే కూని రాగాలు తీస్తూ ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కున్నాడు.


'వివాహ భోజనంబు' అంటూ సన్నగా పాడుకుంటూ భజగోవిందం బొజ్జ గణపతిలా డైనింగ్ టేబుల్ ముందు ఆసీను డయ్యాడు.

'ఈ వేళ స్పెషల్ అయిటం బాయిల్డ్ ఎగ్స్. మసాలా పొడి, వగైరాలు చల్లుతారేమో! నా సామిరంగా! యమ టేస్ట్ ఉంటుంది. రోజుకు అలాంటివి ఇరవై తినమన్నా తను రెడీయే! ఈ వేళ మటుకు తన షేర్ కింద ఆరు ఎగ్స్ ఉంటాయి' అనుకుంటూ వాటి కోసం ప్రత్యేకించిన గిన్నె మూత తీశాడు.

అంతే! కుండెడు చన్నీళ్ళు ముఖాన కొట్టినట్లు గొప్ప ఆశాభంగం ఎదురైంది.

వెక్కిరిస్తున్నట్లు ఒకే ఒక్క కోడిగుడ్డు - అదీ చాలా చిన్న సైజులో.

తన అంచనా ప్రకారం ఆరు, లేదా కనీసం న్యాయంగా తనకి దక్కాల్సిన రెండు కూడా లేకపోవటంతో చుర చుర ఎండుగడ్డి కాలిపోతున్నట్లు ఆవేశం, కోపం అతనిలో మంటలు రేపాయి. పైగా ఆకలితో


కొత్త సిబాకాటాప్. దీన్లోని స్పెషల్ ఫార్ములాలో వుంది అధిక శక్తి. అది నోట్లోని కీటకాలను అంతంచేసి పళ్ళను శుభ్రంగా వుంచుతుంది. అందుకే, సంపూర్ణ రక్షణ, దాంతోటే తాజాదనం కోసం, కేవలం సగం టూత్ పేస్ట్ వేస్తేనే చాలు. (మీ పిల్లలకి, ఉవ్విళ్ళూరించే దాని పిప్పరమెంటు రుచి అంటే బాగా నచ్చుతుంది.)

NEW Cibaca Top TOOTHPASTE

తాజాదనం అధికం, రక్షణ అధికం, టూత్‌పేస్ట్ మాత్రంసగం

నకనకలాడుతున్నా డేమో - తిక్క శంకరయ్యలా పెట్రేగిపోయాడు.

అప్పుడే ఆ గదిలో కొచ్చిన రహీంని చూడగానే రంకెలు ప్రారంభించాడు - "ఒరేయ్! ఇది నీ పనే కదూ?"

ఆ దురుసుకీ, తీవ్రతకీ తెల్లబోయా డతను.

భజగోవిందం బీ.పీ. పెరుగుతూనే ఉంది.

"ఒరే దగుల్బాజీ వెధవ! తిండిపోతు రాముడా! ఇంత కక్కుర్తి, కరువుగొట్టు వుట కేవిట్రా నీది? ముష్టడుక్కోరాదురా!" అంటూ దండకం చదివాడు.

ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరక్కపోవడంతో దయ్యం పట్టిన మనిషిలా గయ్ గయ్ మని అరుస్తూంటే రహీంకి కర్తవ్యం పాలుపోవడం లేదు.

"అలా చిందులు తొక్కి, శివతాండవం చేయకపోతే, ఏం జరిగిందో చెప్పకూడదా సార్!" అ నడిగాడు కొద్దిసేపటి తర్వాత.

"ఒరేయ్ ఉడతలు పట్టే మొహం నువ్వూనూ! ఏం జరిగిందో రికా ర్డేసి వినిపించాలా. నిప్పుల్లో కాలిన వంకాయలా ఆ అవతారం చూడు!" అంటూ మరో నాలుగైను శతనార్థాలు పెట్టి అప్పుడు విషయం చెప్పాడు.

"ఓస్! ఇంత చిన్నదానికా బాబూ అంత రాద్ధాంతం! మనిషికి రెండు చొప్పున మీరే కదా ఎగ్స్ పురమాయించింది. ఆ లెక్కన మీ వాటాలోంచి నేను ఒకే ఒకటి తిన్నాను. అది కూడా సమయం మించిపోయాకనే. మీరు భోం చెయ్యకపోతే ఎలాగూ వేస్టే కదా అని ఆ వెధవ పని చేశాను. క్షమించండి! ఆ చిన్న తప్పుకి ఇన్ని మాట లనడం న్యాయమేనా?"

"వా ళ్ళిద్దరూ ఇవాళ ఎగ్స్ తినరని తెలిసే అందరికీ కలిపి తెప్పించాను. వాళ్ళ తాలూకు నాలుగు ఎగ్స్‌ని ఎవరి పర్మిషన్‌తో తిన్నావో చెప్పరా రాస్కెల్!" కనుగుడ్లు తిప్పుతూ, కనుబొమ లెగరేస్తూ ప్రశ్నించాడు.

అప్పుడు రహీంకి పూర్తిగా బోధపడింది భజగోవిందం ఎందుకంత ఇదిగా గింజుకుంటున్నాడో.

"తప్పు బాబూ! తవరు పెద్ద ఉద్యోగంలో ఉన్నారు. చెత్తకుండీ కాడ ఎంగిలి విస్తళ్ళ కోసం బజారు కుక్కలు కాట్లాడుకున్నట్లు నాలాంటి క్లాస్ ఫోర్‌గాడితో వివాదం పెట్టుకుని, మీ విలువ మీరే దిగజార్చుకుంటారా?"

"ఒరేయ్ చుంచుమొహంగాడా! దొంగ పని చేసి పైగా నాకు నీతో బోధ చేస్తున్నావా? అసలు నీలాంటి వాళ్ళని సస్పెండ్ చేసిపారేస్తే గానీ బుద్ధి రాదు!"

"జై భజరంగ భళీ!" పూనకం వచ్చిన వాడిలా పెద్దగా కేక పెట్టాడు రహీం.

"ఏం కూశావురా భజగోవిందం? నన్ను సస్పెండు చేయిస్తావా? నీ పిండాకూడు. అది నీ వల్లే మవుతుంది. కానీ నేను నిన్ను దెబ్బతియ్యబోతున్నాను కానుకో! నీ భవిష్యత్తుని భూస్థాపితం చేయబోతున్నాను. ఇప్పటిదాకా నా మంచితనాన్నే చూశావు. ఇక మీద నా దుర్మార్గాన్ని రుచి చూపిస్తాను సిద్ధంగా ఉండు!" అంటూ రెచ్చిపోయి, సవాలు విసిరి, శపథం పట్టాడు.

ఆ రాత్రికే రహస్యంగా హైదరాబాద్ బస్సెక్కి, తెల్లారేసరికి కమీషనర్ గారి దర్శనం చేసుకున్నాడు. తన అక్కసంత తీరేలా ఆయన కాళ్ళదగ్గర కూర్చొని అర్ధగంటసేపు భజగోవిందం మీద అనే కానేక ఆరోపణలు చేస్తూ ఎన్నో సంగతులు ఏకరువు పెట్టాడు.

ఆ పెద్దాయన కొంత గాకున్నా, కొంతైనా నమ్మాడు. అప్పటికప్పుడే ట్రంకాల్ బుక్ చేసి 'ఇన్‌స్పెక్షన్ పార్టీ'ని వెంటనే వాపస్ వచ్చేయమని ఆదేశాలు జారీ చేశాడు.

వాళ్ళు తన ముందు రిపోర్టు చేశాక ఒక్కొక్కరినీ పిలిచి రహస్యంగా మరో వ్యక్తి గురించి విచారణ చేశా డాయన. విచిత్రంగా ఆ ముగ్గురిలో కూడా అంతర్గతంగా అణిగిమణిగి ఉన్న అసూయా ద్వేషాలు బహిర్గత మయ్యాయి.

ఒకరి మీ దొకరు పితూరీలు చెప్పుకొని, నేరాలు మోపుకొని గతంలో చేసిన వెధవ పను లన్నింటినీ వెలుగులోకి తెచ్చారు. కమీషనర్ గారి మెప్పు పొందా లనే పేరాశ కూడా వాళ్ళలో విభేదాల్ని సృష్టించింది.

** ** **

ఆ మర్నాడు ఉదయం పదకొం డింటికి హఠాత్తుగా ఒక ఆర్డర్ వెలువడింది.

ఇన్‌స్పెక్షన్ పార్టీలో ఉన్న పాత సభ్యులు నలుగురినీ తీసిపారేసి, పూర్తిగా కొత్తవాళ్ళతో సరికొత్తగా ఆడిట్ పార్టీని ఏర్పాటు చేయడం దాని సారాంశం.

ఆఫీ సంత అట్టుడికిపోయింది. రావణ కాష్ఠం భగ్గు మన్నట్లు గగ్గోలు పుట్టింది.

కొత్త సభ్యులు మనస్ఫూర్తిగా సంతోషించలేకపోతున్నారు. మాజీలు మళ్ళీ ఎలాంటి ఎత్తుగడలు వేస్తారో, తమని ఆ స్థానంలోంచి తప్పించడానికి ఎన్ని తిప్పలు పెడతారో అని బితుకు బితుకు మంటున్నారు.

అవును మరి! ఆది నుంచి అప్పనంగా అనుభవిస్తూ వస్తున్న దర్జా, వైభవం ఇప్పుడు చేజారిపోతుంటే చూస్తూ ఊరుకుంటారా?

ఆ రోజే సాయంత్రం మూడు గంటలకి ఉరుము లేని పిడుగులా మరో ఉత్తర్వు వెలువడింది.

దుష్ట చతుష్టయం లాంటి నలుగురు మాజీలను బదిలీ మీద తలా ఒక జిల్లాకి విసిరిపారేశారు.

ఒక్కసారిగా ఇన్ని పెను మార్పు లెందుకో అన్యు లెవ్వరికీ బోధపడని చిదంబర రహస్యం!

వాళ్ళు రిలీవైపోయాక 'రోగం కుదిరింది' అనుకున్నా రంత. నిజానికి 'తేలు కుట్టింది' అనాలి. ఆ తేడు దొంగలు నోరు విప్పి ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి! ★

## ఊపి శ్వాసంలో ధ్వని శోకంలో

నీ గుండె స్పందిస్తే చాలు
నీవు నినదించగలుగుతావు
నీలోనే అండపిండ బ్రహ్మాండ ముంది!

*

నే నెంతటివాణ్ణని
నీరసించి పలుకబోకు
నీవు కాకపోతే?
ఈ జ్వాలా ద్వీపాల నేలుతున్న దెవరు?

*

నీ బుద్ధిని సారిస్తే
విశ్వ రస్యాలు వశ్యా లవుతాయి
నీ పిడికిలి బిగిస్తే చాలు
బెదురుతూ పరుగులు తీస్తాయి

*

నీ తెలివికి కాక ఈ ప్రకృతి
మరి దేనికీ లొంగదు
నీ చెమటకు కాక ఈ ధరణి
మరి దేనికీ పులకించదు

*

తన ఉనికిని చాటుకోడానికే! ఆ
దేవుడు నిన్ను పుట్టించింది
నీ ఉనికిని కనుగొనే తాను
కనుమరుగైపోయింది.

*

నీవు విశ్వాన్ని జయిస్తావు
ఇది సత్యం
నీలోని షట్ సైతానులను
జయించుకున్నావు
ఇది అక్షర సత్యం
ఈ షట్ శకటాసురులను జయించు
ఖగోళాధిపతి వవుతావు
ఈ విశ్వం నీ నిశ్వాసంలో పుట్టగా
మరో బ్రహ్మవవుతావు.

- టి. వెంకటస్వామి